## క్లుప్తంగా

### వీరభద్రుని సన్నిధిలో 'ఈటల' పూజలు

**కురవి:** మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని బీజేపీ నాయకుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, వద్దిరాజు రాంచందర్‌రావు, చీకటి మహేష్ గౌడ్, శ్రీరామోజు నాగరాజు పాల్గొన్నారు.

**ఈటలను కలిసిన నాయకులు**

**మరిపెడ:** మరిపెడకు వచ్చిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ముదిరాజ్ మహాసభ నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. మరిపెడలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయప్రారంభోత్సవానికి హాజరు కావాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో భిక్షం, ఉపేందర్, యాకూబ్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

### ఎస్సైకి అభినందనలు



**మహబూబాబాద్ రూరల్:** జిల్లా ఫింగర్ ప్రింట్ యూనిట్ ఎస్సై ఈద శివకుమార్ కేంద్రస్థాయిలో ప్రతిష్టాత్మక ఖాన్ బహదూర్ అజీజుల్ హక్ ట్రోఫీని కైవసం చేసుకోగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మంగళవారం ఆయనను అభినందించారు.

**ఏఆర్ పీసీకి..**

ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన ఏఆర్ పీసీ కొంపెల్లి అంజయ్యను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో రిజర్వు డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, అడ్మిన్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

### జయప్రదం చేయాలి

**నెహ్రూసెంటర్/బయ్యారం:** పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 2న జరిగే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు నాగముణి, రాష్ట్ర కార్యదర్శి మోబిన్ అహ్మద్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ రవీంద్రబాబు యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరించారు.

### కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడల జననం



**గార్ల:** పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించడం వలన మేలుజాతి దూడలు జన్మిస్తాయని గార్ల పశువైద్యాధికారి వి.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సీతంపేట గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వైరా, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యులు నాగేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ సురభి నర్సింహరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### విజయవంతం చేయాలి

**దంతాలపల్లి:** ఈనెల 20న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిర పార్కులో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.

### అధికారులకు నెమలి అప్పగింత



**దంతాలపల్లి:** తప్పిపోయి వచ్చిన నెమలి పిల్లను పెంచి పెద్ద చేశారు. అనుమతి లేకుండా అటవీ జంతువుల పెంపకం చేపట్టవద్దన్న నిబంధనతో మంగళవారం దానిని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన తాడిపెల్లి అనిత, ప్రభాకర్ దంపతులు, కాంసాని శ్రీకాంత్‌లకు ఆరునెలల క్రితం తమ చేను వద్ద పనులు చేస్తుండగా జాతీయ పక్షి నెమలి పిల్ల గాయాలతో కనిపించింది. దానిని తీసుకువచ్చి వైద్యం చేయించి పెంచారు. అయిన ఆ ముగ్గురు నెమలిని అలా పెంచడం తప్పు కనుక మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అటవీశాఖ అధికారులకు అప్పగించారు. నెమలిని పెంచిన తీరును తెలుసుకున్న ఎస్సై రాజు, అటవీశాఖ అధికారులు సమ్మయ్య, ఆ ముగ్గురికి సన్మానం చేశారు. కార్యక్రమంలో బొడ్లాడ మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరెంట్‌తో వేట ప్రమాదం..!

- విద్యుత్ తీగలు పెట్టి చేపలు పడుతున్న పలువురు..
- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వైనం

**బయ్యారం:** నీటితో చెలగాటం.. కరెంట్‌తో ఆట ప్రమాదకరమని తెలిసినా కొందరు తమకేం కాదు అనే మొండి ధైర్యంతో చేపల కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయడం లేదు. బయ్యారం, కురవి మండలాల సరిహద్దులో ఉన్న పాకాలవాగుతోపాటు మండలంలోని ఇతర వాగుల్లో ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గింది. దీంతో వాగుల్లో ఉన్న చేపలను పట్టుకునేందుకు కొందరు విద్యుత్ తీగలు పెట్టి వేటను కొనసాగిస్తున్నారు. ఇలా వేటకు వెళ్లి బయ్యారం, కురవి మండలాల పరిధిలోని పలుతండాలకు చెందిన వారు గతంలో మరణించిన సందర్భాలు సైతం ఉన్నాయి. అయినప్పటికీ కొందరు చేపల వేటను కొనసాగిస్తూ ప్రమాదకర పరిస్థితులు తెచ్చుకుంటున్నారు.

**చేతిలోనే కరెంట్..**

వేటకు వెళ్తున్న వ్యక్తులు పొడవాటి కర్రకు విద్యుత్ తీగను అమర్చి కర్రను చేతిలో పట్టుకొని నీళ్లలో పెడతారు. విద్యుత్ ప్రవాహంతో నీటిలోని చేపలు పైకి తేలిన సందర్భంగా పైన ఉన్న వ్యక్తికి విద్యుత్ ప్రసారం నిలిపివేయాలని చేపలు పడుతున్న వ్యక్తి సూచిస్తాడు. విద్యుత్ ప్రసారం నిలిపి వేసిన తరువాత నీటిలో దిగితే ప్రమాదం ఉండదు. అయితే ఈ సమయంలో కొందరు నీటిలో తేలాడుతున్న చేపలను పట్టుకోవాలనే ఉద్దేశంతో చేతిలో ఉన్న విద్యుత్ తీగలను మరిచి నీటిలోకి దిగి ప్రాణాలు పోగొట్టుకున్న పరిస్థితులు ఉన్నాయి.



పాకాల ఏటిలో విద్యుత్ వైర్‌తో చేపలు పడుతున్న వ్యక్తి (ఫైల్)

**విద్యుత్‌శాఖకు నష్టమే..**

వాగుల వెంట ఇష్టానుసారంగా విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన విద్యుత్ వృథా అవడమే గాక కొన్ని సందర్భాల్లో విద్యుత్ ప్రసారమయ్యే తీగలను ఆనుకొని విలువైన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్న సందర్భాలు ఉన్నాయి. విద్యుత్‌తో చేపల వేటకు వెళ్లొద్దని విద్యుత్, పోలీస్ శాఖాధికారులు సూచిస్తున్నప్పటికీ కొందరు పాతపద్ధతినే కొనసాగిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

**చర్యలు తీసుకుంటాం..**



ప్రమాదకర పరిస్థితుల్లో చేపల వేటకు వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దు. విద్యుత్‌తో చేపలు పట్టడానికి వెళ్తున్న వారికి వెళ్లొద్దని కౌన్సిలింగ్ ఇచ్చాం. ఎవరైన విద్యుత్‌తో చేపలు పట్టడానికి వెళ్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలి. చర్యలు తీసుకుంటాం.

– తిరుపతి, ఎస్సై, బయ్యారం

# మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**పెద్దవంగర:** దైనందిన ఆహారంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత పెరుగుతోందని, ఆసక్తి గల మహిళలు ఈ రంగంలో పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్ భాస్కర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈఓ తల్లూరి లత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిరు ధాన్యాలతో బిస్కెట్లు, కేక్‌లు, మురుకులు వంటి ఆహార పదర్థాలను తయారు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. నాబార్డ్ ద్వారా మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి మండలంలోని ఆరు గ్రామాలకు ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. సుమారు 210 మందికి శిక్షణ ఇచ్చామని, ప్యాకింగ్ చేసి పలు ప్రాంతాల్లో విక్రయాలు చేపడుతున్నట్లు తెలిపారు. వీటితోపాటు డిమాండ్‌కు తగిన పలు రకాలతో మిల్లెట్స్ తయారు చేసుకునేందుకు నాబార్డ్ తరఫున ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, రవి సంగార, అసిస్టెంట్ మేనేజర్ నితిన్, ఎస్‌బీఐ మేనేజర్ ప్రవీన్, చైర్మన్ తాళ్లూరి శంకర్ పాల్గొన్నారు.



మిల్లెట్స్ తయారీపై సూచనలు చేస్తున్న ఉదయ్ భాస్కర్

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై తిరుపతి

**బయ్యారం:** అమ్మాయిలు ఎవరినైనా గుడ్డిగా నమ్మి మోసపోవద్దని ఎస్సై తిరుపతి, షీటీం ఆర్‌ఎస్సై సునంద అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం షీటీం భరోసా, మానవ అక్రమ రవాణా, సైబర్‌క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులందరూ న్యూ క్రిమినల్ లా, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్ గాని వాట్సాప్ కాల్ గాని మాట్లాడ రాదని సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేయొద్దన్నారు. ఆపద సమయంలో మహిళలు డయల్ 100కు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దేవేంద్రాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిధులు విడుదల చేయాలని వినతి

**కేసముద్రం:** గ్రామపంచాయతీల్లో గత ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులకు, జీపీల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలంటూ మంగవారం ఎంపీడీఓ క్రాంతికి కార్యదర్శులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శుల ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాంబాబు, ఇస్సంపల్లి నాగార్జున, కోలా దుర్గయ్య, రఘువీర్, శైలజ పాల్గొన్నారు.



కేసముద్రం: ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

**కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి**

**దంతాలపల్లి:** గ్రామపంచాయతీలో సమస్యలు పరిష్కరించే విధంగా చొరవ చూపాలని ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ అప్సర్‌పాషాకు మండల కార్యదర్శులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకవర్గం కాలపరిమితి ముగిసిన నాటి నుంచి పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీటి సమస్యలు తదితర పనులు నిర్వహించామన్నారు. పెట్టిన ఖర్చులను చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జునస్వామి, వెంకన్న, శ్రీకాంత్, మధు, హరి, వెంకన్న, భూలక్ష్మి, సృజన పాల్గొన్నారు.

# వర్గీకరణతో ఆదివాసీలకు న్యాయం



మాట్లాడుతున్న లక్ష్మయ్య

**గూడూరు:** రాష్ట్రంలో వెనకబడిన ఆదివాసీలకు న్యాయం జరగాలంటే గిరిజన తెగలలో వర్గీకరణ జరగాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కొమురం భీం నగర్‌లో మంగళవారం జిల్లా అధ్యక్షుడు సువర్ణపాక వెంకటరత్నం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 34 ఆదివాసీ తెగలు ఉన్నాయన్నారు. వాటిలో వర్గీకరణ జరిగితే ఆదివాసులకు న్యాయం జరుగుతుందన్నారు. అందుకోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అదేవిధంగా ఈనెల 24వ తేదీన గూడూరు మండల కేంద్రంలో జరిగే ఆదివాసీ మహిళా సంఘం జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తుడుందెబ్బ నూతన అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ముయ్యబోయిన విజయ్, కో కన్వీనర్‌లుగా లింగాల స్వామి, కిరణ్, సుధాకర్, ప్రశాంత్ ఎన్నికైనారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, మేడ బుచ్చిరాములు, అర్రెం వీరస్వామి, కొట్టెం శ్రీనివాస్, గట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ఇద్దరిపై కేసు నమోదు

**డోర్నకల్:** మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అతిక్రమించిన ఇద్దరిపై డోర్నకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీరోలు మండలం అందనాలపాడు గ్రామంలో మంగళవారం ముందస్తు అనుమతులు పొందకుండా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్–16ను అతిక్రమిస్తూ డీజే సిస్టమ్‌తో ర్యాలీ తీసి ప్రజల దైనందిత జీవనానికి ఆటంకం కలిగిస్తూ, రాకపోకలకు అంతరాయం కలిగించిన ఆంగోత్ మోహన్, ఆంగోత్ హరీష్‌తో పాటు కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

**తల్సాత్రతండాలో ఒకరికి..**

**కురవి:** ఓ వివాహితను ఓ వ్యక్తి వేధింపులకు గురి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కురవి శివారు తుల్సాత్రతండా జీపీకి చెందిన వివాహిత బాదావత్ సరితను అదేతండాకు చెందిన బాదావత్ శ్రీను కొద్ది రోజులుగా వెంటబడి వేధిస్తున్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

**మిస్సింగ్ కేసు నమోదు**

**నర్సింహులపేట:** మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన చింతకుంట్ల యాకయ్యపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. పడమటిగూడెం గ్రామానికి చెందిన యాకయ్య(35) జనవరి 31న తేదీన మరిపెడ మండలంలోని చిల్లంచర్ల గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. కొద్దిరోజుల తర్వాత బంధువుల ఇంటి వద్ద లేడని తెలియడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# అంగన్‌వాడీ వ్యవస్థను పటిష్టపర్చాలి

**నెహ్రూసెంటర్:** పీఎంశ్రీ స్కూళ్లను వ్యతిరేకించాలని, అంగన్‌వాడీ వ్యవస్థను పటిష్టపర్చాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెస్త సంపూర్ణ, దారా స్నేహ బిందు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ జిల్లా అధికారి ధనమ్మకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... పీఎంశ్రీ పాఠశాలలు ప్రారంభమైతే అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడే ప్రమాదం ఉందన్నారు. కేంద్రాల బలోపేతం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతి, ఆండాలమ్మ, అనిత, రాణి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

### ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్

**మహబూబాబాద్ అర్బన్:** ఈనెల 27, 28 తేదీల్లో జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్‌ను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాని గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోత్ దేశీరాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన శాఖ కార్యాలయంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టెన్త్ టాలెంట్ టెస్ట్ కరపత్రాలను గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోత్ దేశీరాంనాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, గంధసిరి జ్యోతి బసు, పట్ల మధు, సింహాద్రినాయక్, నిక్షిప్త, తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**నెహ్రూసెంటర్:** ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికి ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని, కార్మిక వెల్ఫేర్ బోర్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం అన్నారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీని రూపొందించే క్రమంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని చెప్పిందని, ఏపీ మాదిరిగానే ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికి ఉచితంగా ఇసుక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రావు, బానోత్ శంకర్, గుణగంట్ల రాము, ఐలయ్య, శ్రీశైలం, భూక్య రాము పాల్గొన్నారు.

# తునికాకు టెండర్ల ప్రక్రియలో అలసత్వం

**మహబూబాబాద్ రూరల్:** తునికాకు టెండర్ల ప్రక్రియను, తునికాకు ప్రూనింగు పనులను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా హరినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎఫ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ సిరాజుద్దీన్‌కు మంగళవారం అందజేశారు. తునికాకు సేకరణ ప్రక్రియను ప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందని, ఇప్పటికే తునికాకు టెండర్లు పూర్తి చేసి ప్రూనింగు పనులు ప్రారంభించాల్సి ఉండగా నేటికీ టెండర్లు పిలవకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు లింగోజు బ్రహ్మచారి పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## సంక్షిప్త సమాచారం

**మార్కెట్‌ను సందర్శించిన సీఐ**

**కేసముద్రం:** కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య మంగళవారం ఆకస్మికంగా సందర్శించాడు. ఈమేరకు మిర్చి యార్డుకు వెళ్లి రైతులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మార్కెట్ అధికారులకు, సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మురళీధర్ రాజు, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి**

**మరిపెడ:** ఆటపాటల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని ఎస్సై బొలగాని సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్పోర్ట్స్ మీట్ 2024–25 మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్స్ జర్పుల కాలునాయక్, అఫ్జల్, ప్రిన్సిపాల్ బెన్నిథామస్, అదనపు ఎస్సై సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వాటర్ ప్యూరి ఫయర్ అందజేత**



**పెద్దవంగర:** మండలంలోని ఉప్పరగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన దాతలు వేముల భిక్షపతి, వెంకన్న, ప్రభాకర్ వారి తండ్రి రామస్వామి జ్ఞాపకార్థం రూ.20వేల విలువ చేసే వాటర్ ప్యూరి ఫయర్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ్‌వర్ధన్‌రెడ్డి, కుమారస్వామి, ఉప్పలయ్య, వేముల రఘు, సందీప్ పాల్గొన్నారు.

**కఠినంగా శిక్షించాలి**

**డోర్నకల్:** బీఎస్పీ అధినేత మాయవతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు ఉదిత్ రాజ్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్.విజయకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం డోర్నకల్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీ నేతలను కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు ఐతం ఉపేందర్, కొంద్రు అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

**ఓటర్ కార్డులో మార్పులు చేస్తామంటూ మోసం**

**నెల్లికుదురు:** ఓటర్ ఐడీ కార్డులో అడ్రస్ మార్పులు చేస్తున్న ఇద్దరు ఫేక్ యువకులను గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన మండంలోని మేచరాజుపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేచరాజుపల్లి గ్రామంలో ఇద్దరు ఫేక్ యువకులు ల్యాప్‌టాప్, కంప్యూటర్‌తో గ్రామానికి వచ్చి ఓటర్ కార్డులో ఏ మార్పులు ఉన్నా చేస్తామని ప్రజల నుంచి రూ.100నుంచి రూ.150 వసూలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి గణేష్ ఫేక్ ఐడీ కార్డులను తయారు చేస్తున్న యువకులను అడ్డుకొని గ్రామం నుంచి వెళ్లగొట్టారు.

**వేతనాలు చెల్లించాలి**

**చిన్నగూడూరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎస్ఈఈపీసీ సర్వే విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ ఎన్యుమరేటర్లకు గౌరవ వేతనాలు చెల్లించకపోవడం చాలా బాధాకరమని సర్వే చేసిన ఎన్యుమరేటర్లు వాపోతున్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ(సర్వే నోడల్ అధికారి) రామారావును వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగార్జున, హరిచంద్, నరేష్, జ్యోతి, అవంతిక, తదితరులు పాల్గొన్నారు.

**రైల్వే జీఎంకు ఎంపీ వినతి**

**గార్ల:** గార్లలో మణుగూరు సూపర్ ఫాస్ట్‌ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలను పునరుద్ధరించాలని మంగళవారం రైల్వే జీఎంకు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ వినతిపత్రం అందజేశారు.

**బడ్జెట్‌ను సవరించాలి**

**కేసముద్రం:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వెంటనే సవరించాలంటూ మంగళవారం కేసముద్రం తహసీల్దార్ దామోదర్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గొడిశాల వెంకన్న, చాగంటి కిషన్, జల్లె జయరాజ్, సావిత్ర, సోమారపు ఎల్లయ్య, లక్ష్మయ్య, రమేశ్ పాల్గొన్నారు.

**వృద్ధుడిపై మహిళల దాడి**

**చిన్నగూడూరు:** ముగ్గురు మహిళలు తనపై దాడి చేశారంటూ ఓ వృద్ధుడు చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని విస్సంపల్లి గ్రామానికి చెందిన శాగంటి బక్కయ్యకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలతో నాలుగు రోజుల క్రితం గొడవ జరిగింది. అప్పటి నుంచి ప్రతిరోజు మహిళలు వృద్ధుడిని తిడుతూనే ఉన్నారు. మంగళవారం ఉదయం ఒంటరిగా ఉన్న తనను ముగ్గురు మహిళలు అసభ్యకరంగా తిడుతూ, ఉమ్మి వేసి, కర్రతో దాడి చేశారని తెలిపాడు. ఇట్టి విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

**ఎస్‌బీఐ మినీ బ్రాంచ్ ప్రారంభం**

**గార్ల:** గార్లలోని నెహ్రూసెంటర్‌లో ఎస్‌బీఐ మినీ బ్యాంకు అనుసంధానంతో ఏర్పాటు చేసిన మినీ బ్రాంచ్‌ను మంగళవారం ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ దిలీప్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు నాగేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది సాయి, ఎస్‌కె బుడాన్ పాల్గొన్నారు.

**బస్సు కిందపడి తీవ్రగాయాలు**

**గూడూరు:** మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం బస్సు కింద పడడంతో ఒకరికి తీవ్ర గాయాలై పెనుప్రమాదం తప్పిన సంఘటన జరిగింది. మండలంలోని గాజులగట్టు కొత్తతండాలో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బానోతు రవి అనే ఉపాధ్యాయుడు మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌కు వచ్చి, తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. బ్యాంకు వైపు నుంచి వచ్చిన రవి, మరో వైపునకు వెళ్దామని వాహనాన్ని తిప్పుతున్న సమయంలో ఒక్కసారిగి బస్సుకిందకు వెళ్లింది. డ్రైవర్ అప్రమత్తతతో బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన రవిని స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

### వాహనాల తనిఖీ

**నెల్లికుదురు:** సంబంధిత పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేసి అధిక మొత్తంలో జరిమానాలు విధిస్తున్నట్లు మహబూబాబాద్ ఆర్‌టీఓ సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పలు వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా తమ వెంట వాహనపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఉంచుకోవాలన్నారు. వాహన నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు హాజరు

**మహబూబాబాద్ రూరల్:** హైదరాబాదులోని మహేశ్వరంలో జరుగుతున్న యువజన కాంగ్రెస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్, డోర్నకల్ అసెంబ్లీ అధ్యక్షులు శాగంటి సందీప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత సైనికుల్లా పనిచేయాలని పీసీసీ నేతలు సూచించినట్లు తెలిపారు.

### మహాపడి పూజ

**దంతాలపల్లి:** మండలం దాట్ల గ్రామంలో మంగళవారం శివ స్వాములు మహాపడి పూజ నిర్వహించారు. గ్రామంలోని జంగమేశ్వర ఆలయంలో పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో సుమారు 200 వందల మంది స్వాములు పాల్గొని భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో పోలీస్ డైరెక్టర్ నర్కుటి వెంకన్న జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

**మహబూబాబాద్ అర్బన్:** మానుకోట జిల్లా కేంద్రంలోని 31 వార్డు హన్మతునిగడ్డలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పుచ్చకాయల హన్మమంతు కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మంగళపల్లి రాజ్‌కుమార్ క్వింటా బియ్యం మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటు ఆత్మీయ భరోసాను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌కుమార్, నరేష్, మనోహర్, పృథ్వీ, శ్రీను పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న యువకుడి మృతి

**నెల్లికుదురు:** చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండలంలోని మీఠ్యతండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం మీఠ్యతండాకు చెందిన గుగులోతు రమేశ్ (36)ను అదేతండాకు చెందిన గుగులోతు శంకర్ పాతగొడవల కారణంగా ఈనెల 10న ఒంగోలుకు పనికి వెళ్దామని బయటికి తీసుకెళ్లాడు. మరుసటి రోజుతెల్ల వారు జామున మీఠ్యతండా శివారు లైన్ తండా వద్ద రమేశ్ రక్తపు గాయాలతో పడి ఉన్నాడు. గాయాలతో ఉన్న రమేశ్‌ను కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపాడు. మృతుడి బావమరిది బానోతు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.



రమేశ్ (ఫైల్)